


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | బుధవారం 16 జూన్ 2021 | సంపుటి : 02 | సంచిక :328 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# థర్డ్‌వేవ్ హెచ్చరికలు

### ఏపీ సర్కార్ ముందస్తు ప్రణాళిక
### కోవిడ్ నివారణపై మంత్రి ఆళ్లనాని అధ్యక్షతన
### కేబినెట్ సబ్‌కమిటీ భేటీ



అమరావతి: థర్డ్‌వేవ్ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. పీడియాట్రిక్ అంశాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కోవిడ్ నివారణపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని అధ్యక్షతన మంగళవారం కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కురసాల కన్నబాబు, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, డాక్టర్ సిదిరి అప్పలరాజు, పలువురు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ, చిన్నారులకు వైద్యం కోసం అదనంగా వైద్యులు, సిబ్బందిని నియమించాలని, జనావాసాలకు దగ్గరగా హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో చిన్నారులకు వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్‌ను పరిశీలించాలన్నారు. చిన్నారులకు అవసరమైన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. థర్డ్‌వేవ్‌లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు వ్యాక్సినేషన్ ముమ్మరం చేయాలని, అర్హులైన తల్లులకు ఒక రోజు ముందుగానే టోకెన్లు పంపిణీ చేయాలని తెలిపారు. బ్లాక్ ఫంగ్ సోకిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. ఇంజక్షన్లు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆళ్ల నాని హెచ్చరించారు.

# వరుసగా మూడో ఏడాది
# వైఎస్ఆర్ వాహనమిత్ర అమలు: సీఎం జగన్



అమరావతి: వరుసగా మూడో ఏడాది వైఎస్ఆర్ వాహనమిత్ర అమలు చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల కష్టాలను పాదయాత్రలో నేరుగా చూడటం ద్వారా వాహనమిత్ర పథకం అమలుకు శ్రీకారం చుట్టినట్లు సీఎం జగన్ పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో ఇబ్బందులు పడుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ వాహనమిత్ర' పథకం కింద ఆర్థిక సహాయం అందజేస్తోంది. కరోనా గడ్డు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నెల రోజుల ముందుగానే వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్ఆర్ వాహనమిత్ర పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. వరుసగా మూడో ఏడాది వైఎస్ఆర్ వాహనమిత్ర అమలు చేశామని తెలిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల కష్టాలను పాదయాత్రలో చూశామన్న సీఎం జగన్.. టీడీపీ హయాంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లను పెనాల్టీలతో వేధించిన విషయాన్ని గుర్తుచేశారు. 3,648 కి.మీ సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామని,




2.48 లక్షల మందికి రూ.248.47 కోట్ల నగదు జమ చేస్తున్నామన్నారు. 2.48 లక్షల మందిలో దాదాపు 84% పేదవర్గాల వారే ఉన్నారని ఈ సందర్భంగా సీఎం జగన్ పేర్కొన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకుంది దేశంలో ఏపీ ఒక్కటేనని, దేశంలో ఎక్కడా డ్రైవర్ల కోసం ఇలాంటి పథకం లేదని తెలిపారు. కరోనా కష్టకాలంలో ఆర్థిక సాయం ఎంతో మేలు చేస్తుందని, వాహన బీమాతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిపేర్లకు రూ.10వేలు ఇస్తున్నామని పేర్కొన్నారు. వాహనంలో ప్రయాణించే వారికి కూడా భద్రత ఉంటుందని, వైఎస్ఆర్ వాహనమిత్ర దరఖాస్తుకు మరో నెలపాటు గడువు ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సాయం చేస్తామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపొద్దని కోరుతున్నానని సీఎం జగన్ తెలిపారు. టీడీపీ నేతలు చేసే విమర్శలు హాస్యాస్పదమని, టీడీపీ హయాంలో వాహనాలపై భారీగా పెనాల్టీలు విధించారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో డ్రైవర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారని సీఎం జగన్ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. డ్రైవర్ల కష్టాలను పాదయాత్రలో సీఎం జగన్ చూశారని, కరోనా కష్టకాలంలో ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరమని అన్నారు. షెడ్యూల్ కంటే నెల రోజుల ముందే వైఎస్ఆర్ వాహనమిత్ర సాయం విడుదల చేస్తున్నామని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అవంతి శ్రీనివాస్, కలెక్టర్ వినయ్ చంద్, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యేలు అమరనాథ్, గొల్ల బాబురావు పాల్గొన్నారు. వాహనాల మరమ్మతులు, బీమా, ఇతర ఖర్చుల కోసం ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ఈ ఏడాది 2,48,468 మంది లబ్ధిదారులకు ఈ పథకం కింద ప్రయోజనం కలుగుతుంది. వరుసగా మూడో ఏడాది కూడా ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయటం విశేషం. నేడు జమ చేసిన నగదుతో కలిపి ఇప్పటివరకు రూ.759 కోట్లను డ్రైవర్లకు ప్రభుత్వం అందజేసింది.

# టీడీపీ బీసీనేతలపై విజయసాయి, అవంతి కుట్ర: బుద్ధవెంకన్న

అమరావతి: ఉత్తరాంధ్ర, విశాఖ కేంద్రంగా విజయసాయి, అవంతి శ్రీనివాస్ టీడీపీ బీసీ నేతలపై కుట్ర రాజకీయాలు, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ విజయసాయి అల్లుడు వైసీపీలో చేరమని పల్లా శ్రీనివాసరావుని అడిగితే నిరాకరించారని తెలిపారు. విశాఖలో అధికార పార్టీకి పట్టులేదని, టీడీపీలోని బీసీ నేతలను బెదిరిస్తూ, వేధిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యసభ సభ్యత్వం



ముగిసిన వెంటనే విజయసాయి విశాఖ ఎంపీగా పోటీ చేసి, ప్రజల్లో తనకున్నఆదరణ రుజువు చేసుకోవాలని సవాల్ చేశారు. దొంగలు, దోపిడీదారులు, కబ్జాకోరులు వైసీపీలో ఉంటే, టీడీపీ వారిని కబ్జాకోరులంటారా అని ప్రశ్నించారు. బయటినుంచి వచ్చిన విజయసాయి, అవంతి విశాఖవాసులను అమాయకుల్నిచేసి చెడుగుడు ఆడుతున్నారని మండిపడ్డారు. పల్లా నిజంగా భూములు ఆక్రమించుకుంటే, అతని వద్ద ఉన్నఆధారాలను పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విజయసాయి నేతృత్వంలో జరిగిన కబ్జాల భరతం పడతామని హెచ్చరించారు. విజయసాయి, అవంతి సహా ప్రతి ఒక్కరికీ ఒకటికి, ఒకటిన్నర తిరిగిస్తామన్నారు. కరోనా దెబ్బకు తోడు, జగన్ దెబ్బతో రాష్ట్రం కుదేలైందన్నారు. నిరుద్యోగం, పేదరికం పెరిగి, ఆకలిచావుల దిశగా రాష్ట్రం సాగుతోందని తెలిపారు. రాష్ట్ర, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా భూకబ్జాలు, దోపిడీనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ట్విట్టర్‌కు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు



న్యూఢిల్లీ : ట్విట్టర్‌కు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్యానెల్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఈ సందర్భంగా కమిటీ డిజిటల్ వేదికలపై పౌరుల హక్కుల పరిరక్షణ, మహిళల భద్రత, ఆన్‌లైన్ వార్తలు దుర్వినియోగం కాకుండా తీసుకునే చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం దేశంలో కొత్త ఐటీ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ విషయమై కేంద్రం ఇటీవల ట్విట్టర్‌కు చివరి నోటీసు ఇచ్చింది. కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ నుంచి పదే పదే లేఖలు రాసినా.. ట్విట్టర్ నుంచి సరైన స్పందన రాలేదు. అయితే కొత్త ఐటీ రూల్స్ ను తాము పాటిస్తామని గత వారంలో ట్విట్టర్ హామీ ఇచ్చింది. భారత్‌తో తాము నిర్మాణాత్మక సంభాషణను కొనసాగిస్తామని ట్విట్టర్ ప్రతినిధి పేర్కొన్నారు. కొత్త మార్గదర్శకాలను పాటించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, అయితే కొవిడ్ మహమ్మారి కారణంగా చేయలేకపోయామని పేర్కొన్నారు. చీఫ్ కంప్లైయెన్స్ ఆఫీసర్‌ను నియామకాన్ని పూర్తి చేసే దశలో ఉన్నామని, రాబోయే రోజుల్లో అదనపు వివరాలు అందించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు ఈ నెల 7న ఐటీ మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో ట్విట్టర్ పేర్కొంది. ఈ క్రమంలో కొత్త ఐటీ నిబంధనలను పాటించడానికి ట్విట్టర్‌కు ఉన్న ఇబ్బందులు ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తామని పార్లమెంటరీ కమిటీ ప్రకటించింది. దేశం రూపొందించిన నిబంధనలను అనుసరించడానికి ట్విట్టర్‌కు ఏ పరిమితులు అడ్డంకిగా ఉన్నాయో తాము తెలుసుకోవాలనుకొంటున్నామని పార్లమెంటరీ కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు.

# కేంద్ర కేబినెట్ ఆశలు

విజయవాడ, జూన్ 15, (న్యూస్ పల్స్)కేంద్ర మంత్రి వర్గ విస్తరణపైన ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. సాధ్యమైనంత త్వరలో విస్తరణ ఉంటుంది అన్నది ఢిల్లీ వర్గాల భోగట్టా. అదే జరిగితే ఎవరెవరికి కేంద్ర బెర్తులు దక్కుతాయి అన్నది కూడా చర్చగా ఉంది. అన్నిటికంటే ముందుగా ఏపీ నుంచి ఈసారి ఎవరికి చోటు ఉంటుంది అన్నది కూడా చాలా మంది ఆలోచనగా ఉంది. 2018 తరువాత కేంద్ర మంత్రివర్గంలో ఏపీకి చోటు లేకుండా పోయింది. నాడు టీడీపీ తన మంత్రుల చేత రాజీనామా చేయించి ఎన్డీయే నుంచి బయటకు వచ్చాక మళ్లీ మోడీ సర్కార్ లో ఏపీ నుంచి ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. కేంద్ర మంత్రివర్గ విస్తరణ అనడంతోనే ఏపీ రాజకీయాలు ఒక్కసారిగా హెటెక్కుతున్నాయి. ఎందుకంటే బీజేపీతో ఇక్కడ విభేదించే పార్టీలే లేవు అన్న సంగతి తెలిసిందే. అధికార వైసీపీ, విపక్ష టీడీపీ బీజేపీ ప్రాపకం కోసం తాపత్రయపడుతున్నాయని అంటారు. ఇక చంద్రబాబు మాజీ మిత్రుడు పవన్ కళ్యాణ్ ఇపుడు బీజేపీకి మంచి నేస్తం. 2024 నాటికి ఆయన ద్వారా బీజేపీని తన వైపునకు తిప్పుకోవాలని చూస్తున్న చంద్రబాబు కూడా విస్తరణ జరిగితే ఏపీ నుంచి ప్రాతినిధ్యం ఉండేలా పావులు కదుపుతున్నారుట. ఆయనకు తన మాజీ మిత్రుడు పవన్ కేంద్ర మంత్రి అయినా తనకు చాలు అన్నట్లుగా ఆలోచన ఉందిట. మరో వైపు జగన్ కూడా పై ఎత్తులు వేస్తున్నారు అంటున్నారు. ఆయన తన కుడి భుజం లాంటి విజయసాయిరెడ్డిని కేంద్ర మంత్రిగా చూడాలని భావిస్తున్నారుట. గతంలో కేంద్ర ప్రభుత్వంలో చేరకూడదని జగన్ అనుకున్నా ఇపుడు రాజకీయ మారిన పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంలో తమ వారు ఉండాల్సిందే అని జగన్ గట్టిగా డిసైడ్ అయ్యారని అంటున్నారు. రెండు పదవులు జగన్ కోరుతున్నారు అన్న ప్రచారం కూడా ఈ మధ్య ఆయన జరిగిపిన ఢిల్లీ పర్యటనలో కూడా వినిపించింది. ఒక క్యాబినేట్ మంత్రి, మరో సహాయ మంత్రి వైసీపీకి ఇస్తారు అన్నది కూడా బీజేపీ నేతలు చెబుతున్న మాట. ఇక కేంద్ర మంత్రి వర్గ విస్తరణ అన్నది ఏపీలోని పలువురు ఎంపీలలో కొత్త ఆశలు రేపుతోంది అనే చెప్పాలి. వచ్చే ఏడాది రిటైర్ కాబోతున్న సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారు కూడా ట్రై చేస్తున్నారు అంటున్నారు. ఇక బీజేపీలో ఎంపీగా ఉన్న జీవీఎల్ నరసింహారావు రేసులో ముందున్నారు. అలాగే ఆ పార్టీలో చేరి పెద్ద పదవుల కోసం ఎప్పటి నుంచో చూస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణ వంటి వారు కూడా ఎక్కడో ఒక చోట రాజ్యసభ సీటు ఇచ్చి మరీ కేంద్ర మంత్రిని చేయకపోతారా అని ఎదురుచూస్తున్నారుట.

# సీఎంకు, మంత్రులకు జ్ఞానం ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్న: అశోక్ గజపతి

విజయనగరం: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మాన్సాస్ ఛైర్మన్, సింహాచలం దేవస్థాన అనువంశిక ధర్మకర్త హోదాకు అశోక్ గజపతిరాజే అర్హుడని హైకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో అశోక్ తన కుటుంబ సభులతో, పార్టీ నేతలతో పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు పూర్ణ కలశంతో అశోక్ గజపతిరాజుకు ఘన స్వాగతం పలికారు. పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆలయ సంప్రదాయాల ప్రకారం శేషవస్త్రం, ప్రసాదాలను పూజారులు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రులకు మంచి జ్ఞానం ప్రసాదించాలని పైడితల్లి అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన అన్నారు. నిన్న మొన్నటి వరకు శాశ్వత నష్టం చేకూర్చినవారిలా కాకుండా మూగజీవాలకు పూర్తి రక్షణ కల్పిస్తామని అశోక్ గజపతిరాజు స్పష్టం చేశారు.

# 2024 నాటికి ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్



అమరావతి జూన్ 15, (న్యూస్ పల్స్) తాడేపల్లిలోని సిపిఆర్ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్‌పై ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో వర్క్‌షాప్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించిచారు రాష్ట్రంలో 2024 నాటికి ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో జల్‌జీవన్ మిషన్‌పై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుస్ టెక్నికల్ హ్యాండ్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి ప్రారంభించి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 47శాతం గృహాలకు ఇంటింటి కుళాయి కనెక్షన్ ఇవ్వగలిగామని, ఇదే స్ఫూర్తితో రానున్న రెండేళ్ళలో అనుకున్న లక్ష్యాల మేరకు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.7251 కోట్ల రూపాయల నిధులతో పనులను చేపట్టాల్సి ఉందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై ఉందని అన్నారు. కేంద్రం ద్వారా వస్తున్న నిధులు, రాష్ట్రప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కలిపి రాష్ట్ర వ్యాప్తంగా వాటర్ గ్రిడ్ ప్రణాళిక ప్రకారం పనులను ముమ్మరం చేయాలని అన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 83 శాతం ఇంటింటి కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలనేది లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు అధికారులు సకాలంలో టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ ఏడాది విజయనగరం, నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలకు, 2023 మార్చి నాటికి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణ, అనంతపురం, కర్నూలు, 2024 మార్చి నాటికి శ్రీకాకుళం, తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్‌లు అందించాలనే ప్రణాళికతో ప్రభుత్వం ముందకు పోతోందని వెల్లడించారు. జగనన్న కాలనీల్లో నీటి వసతికి అత్యంత ప్రాధాన్యందేశ చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 30 లక్షలకు పైగా పేదలకు పట్టాలు ఇవ్వడం, తొలిదశలో ఏకంగా15 లక్షలకు పైగా పక్కాగృహాల నిర్మాణంకు సీఎం శ్రీ వైయస్ జగన్ శ్రీకారం చుట్టారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు పక్కాగృహాల నిర్మాణంకు అవసరమైన నీటి వసతిని కల్పించాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులదేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8 వేల జగనన్న కాలనీల లేఅవుట్లు ఉన్నాయని, వాటిలో ఇప్పటి వరకు 3772 లేఅవుట్స్‌కు నీటి సదుపాయం కల్పించారని అన్నారు. మిగిలిన లేఅవుట్స్‌కు కూడా తక్షణం నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో గృహనిర్మాణ పనులు వేగవంతం అవుతున్న నేపథ్యంలో పేదల కాలనీలకు నీటి సదుపాయం ఉండేనే నిర్మాణం సాధ్యమవుతుందని, దీనికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. జగనన్న కాలనీల్లో నీటి సదుపాయం కోసం చేసే పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం ఉండదని తెలిపారు.

# జీవీఎల్ కు మంత్రి పదవి..?



గుంటూరు, జూన్ 15, (న్యూస్ పల్స్)రాష్ట్ర బీజేపీ నేతల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. త్వరలోనే ఏపీ నుంచి కీలక బీజేపీ నేతకు.. కేంద్ర కేబినెట్ లో చోటు కల్పిస్తారని.. ఆయన ప్రకాశం జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావేనని ప్రచారం జరుగుతుండడం గమనార్హం. ఇప్పటికిప్పుడు జీవీఎల్ నరసింహారావు పై ఇలా ప్రచారం సాగడానికి రీజనేంటి ? అనేది కూడా ఆసక్తిగా ఉంది. విషయంలోకి వెళ్తే.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో 2019లో రెండోసారి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఎన్డీయే, రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకుంది. ఈ రెండేళ్లలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. స్వపక్ష, మిత్రపక్ష నేతల మరణాలు, దూరమైన మిత్రుల కారణంగా కేబినెట్ లో ఖాళీలు ఏర్పడ్డాయి. కోవిడ్ తొలి వేవ్‌లో కేంద్ర మంత్రిగా ఉన్న సురేశ్ అంగడి చనిపోగా, అనారోగ్య కారణాలతో మిత్రపక్షం లోక్‌జనశక్తి (ఎల్జేపీ) అధినేత రామ్‌విలాస్ పాశ్వాన్ మృతి చెందారు. బీజేపీతో విబేధాల కారణంగా శివసేన తొలుత దూరమవగా, గతేడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ చిరకాల మిత్రపక్షం శిరోమణి అకాలీదళ్ కూడా దూరమైంది. దీంతో మంత్రి పీఠాలు ఖాళీ అయ్యాయి. ఈ క్రమంలో త్వరలోనే అంటే.. మరో నెల రోజుల్లో కేంద్ర కేబినెట్‌ను ప్రక్షాళన చేస్తారని ఢిల్లీ వర్గాల నుంచి సమాచారం ఉంది. దీంతో ఏపీ బీజేపీ నేతలు కూడా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు కేంద్ర కేబినెట్ లో ఏపీకి చోటు దక్కలేదు. దీంతో రాష్ట్రానికి ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఇంటి కోడలైన నిర్మల సీతారామన్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ, ఆమె కర్నాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పొరుగునే ఉన్న తెలంగాణలో 4 సీట్లు గెలుపొందిన బీజేపీ, ఏపీలో మాత్రం ఒక్క సీటునూ గెలుచుకోలేక పోయింది. ఈ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుజనా చౌదరి, సీఎం రమేశ్, టీజీ వెంకటేశ్ నేరుగా బీజేపీ నుంచి గెలుపొందినవారేమీ కాదు. అయితే ఈసారి విస్తరణలో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కొత్తవారికి కేబినెట్ లో చోటు కల్పిస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఏపీ నుంచి మంత్రయ్యే అవకాశం ఎవరికి ఉందనే చర్చ ఊపందుకుంది. ఆంధ్రప్రదేశ్ కి చెందినప్పటికీ, ఉత్తర్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎల్ నరసింహారావుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కొందరు నేతలు విశ్లేషిస్తున్నారు. ఇక, ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో జీవీఎల్ నరసింహారావు రాజకీయంగా పుంజుకుంటున్నారు. ఏపీలో పార్టీ తరపున ఎప్పటి నుంచో వాయిస్ వినిపిస్తున్నారు. ఈ సమీకరణల నేపథ్యంలో జీవీఎల్ కు మంత్రి పదవిపై ధీమా వచ్చిందని ఏపీ బీజేపీలో చర్చ నడుస్తోంది. మరి ఆయన ఆశలు ఎంత వరకు నెరవేరతాయో ? చూడాలి.

# మళ్లీ ఎన్నికలు

ఏలూరు, జూన్ 15, (న్యూస్ పల్స్)ఎన్నికలు అంటే అధికారంలో ఉన్న వారు మామూలుగా వద్దు అనుకుంటారు. ఎందుకొచ్చిన తలనొప్పి అని కూడా భావిస్తారు. ఎక్కడైనా తేడా కొడితే మొదటికే మోసం వస్తుందని కూడా ఆలోచిస్తారు. కానీ జగన్ విషయం వేరు. ఆయన పట్టుదలకు మారుపేరు. తనకు నచ్చని వారిని అట్టేపెట్టుకుని కొనసాగడం చికాకు. ఇక తన తప్పు లేకుండా మాటపడడానికి కూడా ఆయన ఇష్టపడరు అంటున్నారు. అందుకే ఏపీలో పెద్ద ఎత్తున ఉప ఎన్నికలకు తెరలేపడానికి జగన్ రంగం సిద్ధం చేశారని తెలుస్తోంది. ఒక దెబ్బ తగిలినపుడే మరో దెబ్బ వేయాలి. టీడీపీ గత రెండేళ్ల పెర్ఫార్మెన్స్ చూసుకుంటే ఇంకా అలాగే ఉందని లోకల్ బాడీ రిజల్ట్స్ రుజువు చేశాయి. అదే సమయంలో జగన్ పట్ల, ఆయన పాలన పట్ల జనాలు సుముఖంగా ఉన్నారని కూడా తేలిపోయింది. ఈ జోరులోనే టీడీపీకి మరిన్ని షాకులు ఇవ్వాలని జగన్ అనుకుంటున్నారుట. ఏపీలో ఇపుడు నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి మద్దతు ఇస్తున్నారు. అయితే వారు టెక్నికల్ గా సైకిల్ పార్టీ వారే. పైగా చంద్రబాబు ఈ మధ్య మా ఎమ్మెల్యేలను జగన్ లాగేసుకున్నారంటూ విమర్శలు చేశారు. దాంతో వారిని అధికారికంగా వైసీపీ ఎమ్మెల్యేలుగా చూపించాలన్నది జగన్ పంతంగా ఉందిట. ఇక ఏపీలో మూడు రాజధానులకు జనం మద్దతు లేదని లోకల్ బాడీ ఎన్నికల ముందు వరకూ టీడీపీ గట్టిగా సౌండ్ చేసేది. లోకల్ బాడీస్ ఫలితాలు చూస్తే అన్ని ప్రాంతాలలో ఏకపక్షంగా వైసీపీ విజయాలను నమోదు చేసింది. దాంతో టీడీపీ ఏమీ అనలేని పరిస్థితి ఉంది. దీంతో ఇపుడు టీడీపీ నుంచి తన వైపు వచ్చిన ఎమ్మెల్యేలను రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలు తేవాలని జగన్ ఆలోచిస్తున్నారుట. విజయవాడ నుంచి వల్లభనేని వంశీ, గుంటూరు నుంచి మద్దల గిరి, ప్రకాశం నుంచి కరణం బలరాం, విశాఖ సౌత్ నుంచి వాసుపల్లి గణేష్ కుమార్ లను ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయిస్తే కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. అలాగే విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదిస్తే అక్కడ కూడా ఉప ఎన్నిక ఖాయంఇక నర్సాపురం రెబెల్ ఎంపీ రఘురామకృష్ణం రాజు మీద అనర్హత వేటు వేయిస్తే అక్కడ కూడా ఉప ఎన్నిక అనివార్యం అవుతుంది. కడప జిల్లాలో బద్వేల్ వైసీపీ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య కరోనాతో చనిపోవడంతో ఉప ఎన్నిక ఆరు నెలల వ్యవధిలో రావడం తథ్యం. దాంతో పాటుగానే వీటిని కూడా చేర్చి మొత్తంగా మినీ సమరానికి జగన్ సిద్ధపడాలని అనుకుంటున్నారుట. సహజంగానే అధికార పార్టీగా వైసీపీ కి ఎడ్జ్ ఉంది. దాంతో పాటు జగన్ పథకాలు కూడా జనంలో ఉన్నాయి. టీడీపీ నుంచి పెద్దగా యాక్టివిటీ లేదు. దాంతో ఈ సీట్లు అన్నీ కూడా వైసీపీ గెలిచి తీరుతుందదని ఆ పార్టీ పెద్దలు అంచనా వేస్తున్నారు. ఈ దెబ్బతో టీడీపీని చిత్తు చేయడమే కాకుండా అటు పార్టీలో రెబెల్స్ నోరు లేవకుండా చూసుకోవడం, ఏపీలో రాజకీయం మొత్తాన్ని అనుకూలం చేసుకోవడమే జగన్ పొలిటికల్ అజెండా అంటున్నారు. మొత్తానికి జగన్ డెసిషన్ తో ఏపీలో పెద్ద ఎత్తున ఉప ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# కాంగ్రెస్ కోలుకోనేది ఎలా



విజయవాడ, జూన్ 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పరిస్థితి నానాటికి దిగజారుతుంది. కేంద్రంలో కాంగ్రెస్ కు సానుకూలత వాతావరణం ఉన్నప్పటికీ ఏపీలో మాత్రం ఆ ఛాయలు కన్పించడం లేదు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ గత పదేళ్ల నుంచి ఏపీ శాసనసభలో ప్రాతినిధ్యం దక్కలేదు. మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతుంది. ఇటువంటి సమయంలో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెన్ కు మరోసారి పరాభావం తప్పదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శైలజానాథ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనేక ఎన్నికలు జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక కూడా జరిగింది. అయితే ఏ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించలేదు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ ను ఇప్పటికీ ఏపీ ప్రజలు దరి చేర్చుకోవడానికి ఇష్టపడటంలేదు. బీజేపీపై వ్యతిరేకత ఉన్నప్పటికీ అది వైసీపీ, టీడీపీ వైపులకు మళ్లుతుందే తప్ప కాంగ్రెస్ వైపు టర్న్ కావడం లేదు. వచ్చే ఎన్నికల్లోనైనా కనీసం శాసనసభలో ప్రాతినిధ్యం ఉండాలన్న లక్ష్యాన్ని కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ నేతలకు నిర్దేశించింది. అయితే ఒంటరిగా పోటీ చేస్తే అది సాధ్యం కాదని కాంగ్రెస్ నేతలు తేల్చి చెబుతున్నారు. టీడీపీతో కలసి వెళితే బాగుంటుందన్న సూచనలు కూడా అందుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే బీజేపీ నేతలు టీడీపీతో కలసి పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. దీంతో చంద్రబాబు పంచన చేరాలన్నది కాంగ్రెస్ నేతల ఆలోచనగా ఉంది. 2018 ఎన్నికల్లో చంద్రబాబు తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్నారు. అయితే ఏపీ ఎన్నికలకు వచ్చే సరికి పార్టీని దూరంగా పెట్టారు. అయితే తమకు బలమైన ఓటు బ్యాంకు ఇప్పటికీ ఉందని కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును బీజేపీ ఎటూ దూరం పెడుతుందని, అప్పుడు ఆయన కమ్యునిస్టులు, కాంగ్రెస్ వైపు చూడక తప్పదన్న ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. మొత్తం మీద కాంగ్రెస్ నేతల ఆశలన్నీ చంద్రబాబుపై ఉన్నాయన్నది వాస్తవం. మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

# మోదీని ప్రశ్నించలేని దుస్థితిలో వైసీపీ, టీడీపీ: మస్తాన్ వలీ



విజయవాడ జూన్ 15, (న్యూస్ పల్స్): మోదీని ప్రశ్నించలేని దుస్థితిలో వైసీపీ, టీడీపీ ఉన్నాయని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ విమర్శించారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఏపీలో వ్యాస రచన పోటీలు నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు ఏపీసీసీ కార్యాలయంలో మస్తాన్ వలీ, రాజీవ్ రతన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మస్తాన్ వలీ మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ 51వ పుట్టిన రోజు సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆన్ లైన్ విధానంలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రెండు గ్రూపులుగా 16-45, 45పై బడిన వారు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. రక్తదానం, అన్నదానంతో పాటు చైతన్య కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎంఫిల్ పూర్తి చేసిన విద్యావేత్త రాహుల్ గాంధీ...దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో నూతన విధానాలను అమలు చేశారని చెప్పారు. నోట్ల రద్దుతో బ్లాక్ మనీ తేలేకపోయినా... ప్రజలకు కష్టాలు తెచ్చారని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీ ముందే ఈ ప్రమాదం చెప్పినా మోదీ మాయ మాటలతో మోసం చేశారన్నారు. అంబానీ గ్రూపుకు వేల కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టి, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లుండీ చూడలేని గుడ్డి ప్రభుత్వాలుగా మారాయన్నారు. కరోనా వల్ల ప్రజలు ఇబ్బందులు పడినా సకాలంలో స్పందించ లేదని మండిపడ్డారు. రాహుల్ గాంధీ బాధ్యతతో అనేక సూచనలు చేసినా పట్టించుకోలేదన్నారు. నరేంద్ర మోదీని ప్రశ్నించ లేని దుస్థితిలో వైసీపీ, టీడీపీ ఉన్నాయని వ్యాఖ్యానించారు. మోదీ మోసాలను నిలదీసే దమ్ము ఒక్క కాంగ్రెస్‌కే ఉందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక పారిపోయిన చరిత్ర బీజేపి నేతలదని వ్యాఖ్యానించారు. కరోనాతో లక్షల మంది చనిపోయారు అంటే అది ప్రభుత్వాల వైఫల్యమే అని అన్నారు. కేంద్రం, రాష్ట్రం ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడమే తప్ప.. చేసిందేమీ లేదన్నారు. మందులు, ఆక్సిజన్, బెడ్‌ల కొరత ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకో లేదని తెలిపారు. భవిష్యత్తుపై దూర దృష్టి ఉన్న రాహుల్ గాంధీ పాలన దేశానికి ఎంతో అవసరమని చెప్పుకొచ్చారు. దేశ ప్రజలంతా ఆయన ప్రధానిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ రేట్లను ఇష్టం వచ్చినట్లుగా పెంచేస్తున్నారని మండిపడ్డారు. ధరలు తమ పరిధిలో లేవని కేంద్ర మంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రభుత్వాల మోసాలను ప్రజలకు వివరిస్తామని మస్తాన్ వలీ తెలిపారు.

# ఆదానీ, అంబానీలు దూసుకుపోతున్నారు...



ముంబై, జూన్ 15, (న్యూస్ పల్స్)కరోనా కాలంలోనూ రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ, అదానీ చీఫ్ గౌతమ్ అదానీల సంపద వేగంగా పెరుగుతూనే ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటికే అంబానీ సంపద 7.62 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.55,802 కోట్లు) పెరిగి 84 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.6,15,147 కోట్లు) చేరుకుంది. దీంతో ఆయన ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో 12వ స్థానంలో నిలిచారు. అంతేకాదు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. చైనా కుబేరులు జాక్ మా, ఝూంగ్ షాన్సన్ వంటి వారి వెల్త్‌ను కూడా దాటేసి రికార్డు సృష్టించారు. ఆసియాలో అత్యంత సంపన్నుడు కూడా ఈయనే! మరో గుజరాతీ అయిన గౌతమ్ అదానీ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 43.2 బిలియన్ డాలర్లు సంపాదించారు. దీంతో ఆయన మొత్తం సంపద ఏకంగా 77 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.5,63,884 కోట్లు) చేరుకుంది. ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో అదానీ14వ స్థానంలో నిలిచారని బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అంబానీ, అదానీలు స్టాక్ మార్కెట్ ర్యాలీల ఫలితంగా విపరీతంగా డబ్బు సంపాదించారు. నిఫ్టీ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 13 శాతం పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 12 శాతం పెరిగి రూ.2,215.80లకు ఎగిశాయి. అయితే రిలయన్స్ నెట్‌వర్క్18 మీడియా ఢ ఇన్వెస్ట్‌మెంట్స్ షేర్లు 40?45 శాతం మధ్య పెరిగాయి. అదానీ గ్రూప్ కంపెనీలలో అదానీ టోటల్ గ్యాస్ షేర్లు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 335 శాతం ర్యాలీ చేశాయి. గత నెల 11న దీని షేరు విలువ రూ. 1,625.8 కాగా, ఈ ఏడాది జనవరిలో రూ. 374.9 రూపాయలు మాత్రమే కావడం గమనార్హం. అదానీ ట్రాన్స్‌మిషన్ 264 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 235 శాతం పెరిగాయి. అదానీ పవర్ స్టాక్స్ 200 శాతం, అదానీ పోర్ట్స్ షేర్లు74 శాతం పెరిగాయి. అదానీ గ్రీన్ షేర్లు 17 శాతం శాతం ఎగిశాయి. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ టాప్?100 సంపన్నుల్లో మనదేశం నుంచి విప్రో అధిపతి అజీమ్ ప్రేమ్‌జీ (42 వ స్థానం), హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ శివ నాడార్ (72 వ), లక్ష్మి మిట్టల్ (88 వ)లకు చోటు దక్కింది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరోసారి వరల్డ్ రిచెస్ట్ పర్సన్‌గా రికార్డుల్లో నిలిచారు. ఆయన సంపద విలువ డాలర్లు 194 బిలియన్ డాలర్లకు పెరిగింది. లూయిస్ విటన్ వంటి లగ్జరీ బ్రాండ్ల అధిపతి ఎల్‌వీఎంహెచ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బెర్నార్డ్ ఆర్నాల్ట్ కు రెండోస్థానం దక్కింది. ఈయన సంపాదను 173 బిలియన్ డాలర్లుగా లెక్కించారు. 169 బిలియన్ డాలర్ల సంపదతో టెస్లా బాస్ ఎలన్ మస్క్ మూడవ స్థానంలో ఉన్నారు. మైక్రోసాఫ్ట్ ఫౌండర్ బిల్ గేట్స్ (145 బిలియన్ డాలర్లు) , ఫేస్‌బుక్ సీఈఓ జుకర్‌బర్గ్ (124 బిలియన్ డాలర్లు) వరుసగా 4,5వ స్థానాల్లో ఉన్నారు. గూగుల్ చీఫ్ లారీ పేజ్, సెర్జీ బ్రిన్, వారెన్ బఫెట్ వంటి ఇతర బిలియనీర్ల పేర్లు కూడా బిలియనీర్స్ ఇండెక్స్ జాబితాలో ఉన్నాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఆర్నల్ట్, ఫ్రాంకోయిస్ బెటెన్‌కోర్ట్ మేయర్స్ మినహా మిగతా వారందరూ అమెరికన్లు. వీరందరికీ అంబానీ కంటే ఎక్కువ సంపద ఉంది.

# ముఖ్యమంత్రి కార్యాలయం.. ఓవర్ టూ విశాఖ

విశాఖపట్టణం, జూన్ 15, (న్యూస్ పల్స్)విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. తొలుత ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కేంద్రం కూడా సూచనప్రాయ అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో అమిత్‌షాను కలిసిన సమయంలో ఇదే అంశంపై వినతిపత్రం సమర్పించగా, ప్రాథమికంగా అంగీకరించినట్లు తెలిసింది. దీంతో త్వరలో విశాఖ నుంచి సిఎం పరిపాలన చేపట్టనున్నారు. మిగిలిన కార్యాలయాలనూ నెమ్మదిగా ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నారు. ఈలోపు కోర్టు కేసులూ పరిష్కారమవుతాయని అంచనా వేస్తున్నారు. ముందుగా అక్కడకు వెళితే కార్యాలయ ఏర్పాటు ఖర్చులను సంబంధితశాఖ ముఖ్య అధికారి నుంచి వసూలు చేస్తామని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు భయపడుతున్నారు. అక్కడ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తే కోర్టు మొట్టికాయలు వేయడంతోపాటు, కోర్టు ధిక్కరణ కేసులు పెడుతుందేమోననే భయం వారిని వెంటాడుతోంది. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారి గోపాలకృష్ణ ద్వివేది కూడా కోర్టు మెట్లెక్కిన సంగతిని వారు గుర్తు చేస్తున్నారు. ముందుగా సిఎంఒను విశాఖలో ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా కార్యాలయాలు ఒక్కోటి ఏర్పాటు చేసుకోవచ్చని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కూడా పరిపాలనా రాజధానికి వినతిపత్రం తీసుకున్న సమయంలో విశాఖలో రాజధాని ఏర్పాటుకు సంబంధించిన వివరాలూ అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు ఎన్ని ఏర్పాటు చేయాలి, గుంటూరు, విజయవాడ నగరంతోపాటు తాడేపల్లి పరిధిలో ఉన్న కార్యాలయాల వివరాలన్నీ తీసుకున్నారు. సిబ్బంది మొత్తాన్ని ఎప్పట్లోపు అక్కడకు తరలించాల్సి వస్తుందనే అంశాలపై అన్ని శాఖల నుండి సమాచారం సేకరించారు. విశాఖలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న, ఇబ్బంది లేని స్థలాల్లో వెంటనే ఏదో ఒక నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. కోర్టులకు వెళ్లిన వాటిని వదిలేసి మిగిలిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ స్వాధీనం చేసుకున్న వాటిల్లో 110 ఎకరాలను మినహాయించి మిగిలిన వాటికి ఎటువంటి అభ్యంతరాలూ ఉండకపోవచ్చని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి సమగ్ర నివేదికనూ విశాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. వీటిల్లో ఎక్కడ వీలైతే అక్కడ వెంటనే ప్రభుత్వ కార్యాలయాలకు భవనాల నిర్మాణం చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించినట్లు తెలిసింది. సిఎంఒ ఏర్పాటు చేయాలనుకున్న గెస్ట్‌హౌస్‌కు ఇంకా పునాదుల దశ కూడా దాటలేదని, ఇతర భవనాల్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడ నుంచి పరిపాలన చేపడతారని తెలిసింది.

## పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవడ మే బ్రాహ్మణత్వం

కాకినాడ జూన్ 15, (న్యూస్ పల్స్)కరోనా కారణంగా గత ఏడాది మార్చి నెల నుంచి పురోహితం కోరే పురో హితులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వనీ గానీ, ప్రైవేటు సంస్థలు సంస్థలు గానీ పట్టించుకోలేదు. దేవాదాయ శాఖ వీరిని గుర్తించలేదు. ఇలాంటి నేపథ్యంలో ఈ ఒక్క నెలలోనే మూడుసార్లు దాతల సహకారంతో కాకినాడ ఇంద్రపాలెం సుబ్రహ్మణ్య స్వామి గుడి పక్కన పిండప్రదానాలు చేసే పురోహితులకు దాతల సహకారంతో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధి డి హెచ్ వి సాంబశివరావు బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. హైదరా బాద్ కు చెందిన కె వి ఎల్ నారాయణ సౌజన్యంతో మరోసారి వీరికి నిత్యవసర వస్తువులు సమకూర్చారు. ప్రముఖ సామాజిక సేవ కార్యకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ అర్చకులు దత్తు చేతులమీదుగా వీరికి అందజేశారు .దక్షిణ సమర్పించారు. జిల్లావ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పురోహితులు అందర్నీ ఆదుకుని వారి ద్వారా పురోహితం కోరుకుంటామని సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో జె సత్యనారాయణ, పుట్టకొండ దేవస్థానం ఈవో వడ్డాది సత్తిబాబు, బ్రాహ్మణ సంఘాల నాయకులు అల్లంరాజు బాబీ, చక్రవర్తుల వేణు, గోవర్ధనం శేషాచార్యులు, ఖండవల్లి హనుమంతరావు, చాగంటిపాటి అబ్బు తదితరులు పాల్గొన్నారు. కె వి ఎల్ నారాయణ కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

# నవ్యాంధ్రప్రదేశ్ ను అరాచకాంధ్రప్రదేశ్ గా మారుస్తున్న జగన్ రెడ్డి

## కింజారపు అచ్చెన్నాయుడు



విజయవాడ నవ్యాంధ్రప్రదేశ్ ను అరాచకాంధ్రప్రదేశ్ గా జగన్ రెడ్డి మారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. అభివృద్ధి పథంలో ముందుంచాల్సిన రాష్ట్రాన్ని అరాచకాలు, అకృత్యాలు, అన్యాయాల్లో ముందంజలో ఉంచారు. రెండేళ్ల జగన్ రెడ్డి పాలనలో కక్షసాధింపు చర్యలు తప్పా ప్రజలు చేసింది ఏమీ లేదని అయన అన్నారు. అమరావతి మండలం ఉంగుటూరు గ్రామంలో సర్పంచ్ భర్త సోమశేఖర్ పై వైసీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రెండు నెలల్లో ఆరు సార్లు దాడి జరిగినా ఇంత వరకు ఎందుకు కేసు నమోదు చేయలేదు? సర్పంచ్ గా గెలిచిన నాయకులను అభివృద్ధి పనులు చేస్తే దాడులు చేస్తారా? దాడికి పాల్పడిన రాయపాటి శివ వెంటనే అరెస్ట్ చేయాలి. అతనిపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి. ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న జిల్లాలో హోం మంత్రి సొంత జిల్లాలో ఇలాంటి దాడులు జరగటం సిగ్గుచేటు. 24 గంటల్లో దోషులను అరెస్టు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు ఏదో ఒక చోట దాడులు, దౌర్జన్యాలకు వైసీపీ నాయకులు తెగపడటం జగన్ రెడ్డి ఫ్యాక్షనిస్టు పాలనకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. రాజధానిని కాపాడుకోవడానికి అమరావతి ప్రజలు చేస్తున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు జగన్ రెడ్డి దాడులకు పాల్పడం దౌర్భాగ్యమని అయన అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులపై ఆర్ధికంగా, సామాజికంగా, రాజకీయంగా దెబ్బతీసి ప్రతిపక్ష పార్టీని అణచివేసేందుకు కుట్ర చేయడం సిగ్గుచేటు. జగన్ రెడ్డి తలకిందులు తపస్సు చేసినా టీడీపీని ఏమీ చేయలేరు. ప్రజల హృదయాల్లో, కార్యకర్తల గుండెల్లో చంద్రబాబు నాయుడు కోసం గూడుకట్టుకున్న అభిమానాన్ని చెరపలేరని అయన అన్నారు.

# రిటైర్డ్ ఐఏఎస్ ఉదయలక్ష్మికి నాన్ బెయిలబుల్ వారెంట్

అమరావతి: రిటైర్డ్ ఐఏఎస్ ఉదయలక్ష్మికి ఏపీ హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గతంలో ఓ పీఈటి అధ్యాపకుడి విషయంలో హైకోర్టు ఉత్తర్వులను ఆమె భేఖాతరు చేయడంపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. గతంలో రాజమండ్రికి చెందిన పీఈటి రత్నకుమార్ తనకు అన్యాయం జరిగిందంటూ హైకోర్టును ఆశ్రయించారు. అతనికి న్యాయం చేయాలని అప్పుడు ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉదయాలక్ష్మికి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలను ఆమె అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కారణగా పరిగణించిన హైకోర్టు ఇవాళ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణ సమయంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి ఉదయలక్ష్మిని హైకోర్టులో హాజరు పరచాలని గుంటూరు రూరల్ ఎస్పీకి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రస్తుత సీఎస్, గత ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అదిత్యనాథ్ దాస్‌కు హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణ రెండు వారాలపాటు వాయిదా వేసింది. కాగా పిటిషనర్ తరుపున హైకోర్టు సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపించారు.



# పల్లె ప్రగతి పెండింగ్ పనులు ఈనెల 19 లోపు పూర్తి చేయాలి

**అలసత్వం వహిస్తే సెక్రటరీ లపై కఠిన చర్యలు....**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**పల్లె ప్రగతి పనులపై సమీక్ష సమావేశం......**

అసిఫాబాద్ జూన్ 15 అసిఫాబాద్ జిల్లాలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పంచాయతీలలో చేపట్టిన పనులు ఈ నెల 19 లోపు పూర్తి చేయాలని, పంచాయతీ సెక్రటరీలు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని వద్దేపల్లి గార్డెన్ లో మంగళవారం ఉదయం ఆసిఫాబాద్ డివిజన్ ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, మధ్యాహ్నం కాగజ్ నగర్ డివిజన్ ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీ లతో పల్లె ప్రగతి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి లో భాగంగా పంచాయతీలలో చేపట్టిన నర్సరీలు, సగ్రగేశన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికల్లో పెండింగ్ లో ఉన్న పనులు ఈ నెల 19 లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మండలాల వారీగా గత ఆరు నెలల క్రితమే పంచాయతీ సెక్రెటరీ లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. జిల్లాలో కొన్ని పంచాయతీల్లో పల్లె ప్రగతి పనులు అధ్వానంగా ఉన్నాయని తీరు మార్చుకోకపోతే పంచాయతీ సెక్రెటరీ లపై వేటు తప్పదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రితో పాటు, ప్రిన్సిపల్ సెక్రెటరీ, చీఫ్ సెక్రటరీలు పల్లె ప్రగతి పనుల పర్యవేక్షణకు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని ప్రతి పంచాయతీ లో పనులు పూర్తి కావాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు ప్రతిరోజు ఆయా మండలాల ఎంపీఓలకు రోజువారీగా చేసే కార్యక్రమాల వివరాలు అందించాలన్నారు. ఇప్పటికే దీనికోసం మూడు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా ప్రతిరోజు ఉదయం 6 గంటల వరకు తాము చేసిన చేయబోయే పనులు అందులో పోస్ట్ చేయాలన్నారు. మండలాల ఎంపీడీవోలు ప్రతిరోజు టూర్ డైరీ నిర్వహించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పల్లె ప్రకృతి వనాలకు సంబంధించి రెవెన్యూ, అటవీ భూములు అందుబాటులో లేకుంటే పంచాయతీ నిధుల నుండి భూములు కొనుగోలు చేయాలని తెలిపారు. పల్లె ప్రకృతి వనం లో 100 శాతం మొక్కలు బతికేలా చూడాలన్నారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వీటిపై శిక్షణ కార్యక్రమాలు ఇచ్చినప్పటికీ కొన్ని చోట్ల మొక్కలు పెట్టకపోవడం, కొన్ని చోట్ల పెరగకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. పనిచేయడం ఇష్టం లేకుంటే రాజీనామా చేయాలని పంచాయతీ సెక్రటరీ లను హెచ్చరించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చినా కొంతమందిపై తీవ్రంగా మండిపడ్డారు. స్మశాన వాటిక లకు కొన్నిచోట్ల కంచె లేదని వాటికి చుట్టూ మొక్కలు నాటి గ్రీన్ ఫెన్సింగ్ వేయాలన్నారు. పల్లె ప్రగతి అభివృద్ధి పనుల పై పంచాయతీ సెక్రెటరీ లకు సర్పంచులకు కనీస అవగాహన లేకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. సగ్రగేశన్ షెడ్డు లో కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తారీకు నుండి పల్లె ప్రగతి పనులు ఆకస్మికంగా తనిఖీ చేస్తానని ఎక్కడైనా అధికారులు అలసత్వం వహిస్తే సంబంధిత సెక్రెటరీ ఎంపీడీవో పై చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రెటరీ లను తొలగిస్తామని హెచ్చరించారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం మాట్లాడుతూ పంచాయతీలను శుభ్రంగా ఆరోగ్యంగా అభివృద్ధి పరంగా చేసే బాధ్యత సెక్రెటరీ లపై ఉందన్నారు. పంచాయతీ సెక్రటరీలు విధిగా ఆరు గంటలకు పంచాయతీ లో ఉండాలని, ఎంపీవోలు 6:15 నిమిషాలకు విధుల్లోకి రావాలన్నారు. స్థానికంగా సెక్రటరీలు అందుబాటులో ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి భావించారని దాని ప్రకారం ప్రతి పంచాయతీకి ఒక సెక్రటరీ ని కేటాయించారని గుర్తు చేశారు. పంచాయతీకి అందుబాటులో ఉండని సెక్రెటరీ కి హాజరు ఆధారంగా జీతం అందించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పంచాయతీల అభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని తెలిపారు. పంచాయతీలలో సెక్రటరీలు ఎంతో ముఖ్యమైన వారని ప్రతి పనిని బాధ్యతగా చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి రవికృష్ణ, ఆసిఫాబాద్ ఆర్డిఓ దత్తు, జిల్లా పరిషత్ సీఈవో రత్నమాల డిఎల్పిఓ రమేష్, అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీ లో పాల్గొన్నారు.

# పులివెందులలో తుపాకీ కాల్పులు?ఇద్దరు మృతి

కడప కడప జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వైసిపి కి చెందిన రెండు కుటుంబాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో జరిగిన తుపాకీ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పార్థసారథి రెడ్డి (48), ప్రసాద్ రెడ్డి ( 62 ) ఇరువురు బంధువులు. వీరి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఉదయం ప్రసాద్ రెడ్డి ఇంటి పైకి మచ్చు కత్తి తీసుకొని పార్థసారధి రెడ్డి దాడి చేయబోయాడు. నన్ను చంపుతా డెమో అన్న ఆందోళనతో ప్రసాద్ రెడ్డి ( కాబోయే మండలాధ్యక్షుడు) తన దగ్గర ఉన్న లైసెన్స్ తుపాకీతో పార్థసారథి రెడ్డి పై రెడ్డిపై కాల్పులు జరిపాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. .అనంతరం అదే తుపాకితో ప్రసాద్ రెడ్డి కూడా తన లైసెన్సు రివాల్వర్ తో ఆయనే కాల్చుకొని మృతి చెందాడు. ప్రస్తుతం పోలీసులు గ్రామంలో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

# కోవిడ్ కన్నా శక్తివంతమైనది, ఘోరమైనది, వేగవంతమైనది శాస్త్రవేత్తల అంచనా..



కోవిడ్ మహమ్మారి వల్ల ప్రపంచానికి జరిగిన నష్టం చిన్నది కాదు. ప్రపంచ ప్రజలు అన్ని విధాలుగా బాధపడి సంవత్సరం అయిపోయింది. కానీ 2021 పుట్టుకతో, కోవిడ్ వైరస్‌కు వ్యతిరేకంగా వ్యాక్సిన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్న శుభవార్త ప్రపంచవ్యాప్తంగా ఆశలను పెంచుతోంది. కానీ ప్రజల నుండి వచ్చిన నివేదికలు ఏమి జరుగుతుందో చెబుతున్నాయి. ఎందుకంటే కోవిడ్ వైరస్ కంటే దారుణమైన పరిస్థితిని ప్రపంచం చూడబోతోందని వారి వాదన.ఎబోలా వైరస్ను కనుగొన్న ప్రొఫెసర్ జీన్-జాక్వెస్ ముయాంబే టాంఫ్, కొత్త మహమ్మారి ప్రపంచాన్ని కదిలిస్తుందని కూడా పేర్కొన్నారు. 'డిసీజ్ ఎక్స్' గా పిలువబడే ఈ కొత్త ఘోరమైన వైరస్లు మానవాళిని ప్రభావితం చేస్తాయని ఆయన హెచ్చరించారు.కోవిడ్ 19 మాదిరిగా, ఈ వ్యాధి మరొక అంటు వ్యాధిని కలిగిస్తుంది. ఆఫ్రికాలోని ఉష?మండల వర్షారణ్యాల నుండి కొత్త మరియు ఘోరమైన వైరస్లు వెలువడుతున్నాయని మరియు అవి జంతువుల నుండి మానవులకు వ్యాప్తి చెందుతాయని థాంప్స్ హెచ్చరిస్తున్నారు. ఇది కోవిడ్ కంటే వేగంగా వ్యాపించి విపత్తుకు దారితీస్తుందని ఆయన అంచనా వేశారు.కామెర్లు, ఇన్ఫ్లుఎంజా, రాబిస్, బ్రూసెలోసిస్ వంటి వ్యాధుల ఉదాహరణలను ఆయన పంచుకున్నారు. ఇవన్నీ ఎలుకలు లేదా కీటకాల నుండి మానవులకు సంక్రమించే అంటు వ్యాధులు. తెలియని ఎబోలా వైరస్ను 1976 లో ప్రొఫెసర్ జీన్-జాక్వెస్ ముయాంబే టాంఫ్ కనుగొన్నారు.ఆఫ్రికాలోని కాంగోలో కొత్త కేసు నమోదైంది. లక్షణం రక్తస్రావం జ్వరం. ఎబోలా పరీక్ష చేర్చబడింది కాని ఫలితం ప్రతికూలంగా ఉంది. దీనితో, 'డిసీజ్ ఎక్స్' నిర్ధారణ అయిన మొదటి రోగి అతనేనని వైద్యులు అనుమానిస్తున్నారు.కోవిడ్ వైరస్ వేగంగా వ్యాపించినప్పటికీ, మరణాల రేటు తక్కువగా ఉంది. అయితే, ఎబోలా వైరస్ 50-90 శాతం మరణాలకు కారణమవుతుంది. అందుకే 'డిసీజ్ ఎక్స్‌సెస్' ప్రపంచంలో కొత్త భీభత్సం స ృష్టిస్తుందని నమ్ముతారు. జంతువులు లేదా పక్షుల నుండి ఈ వైరస్ మానవులకు వ్యాపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.వ్యాధి అనేది మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించే తెలియని వైరస్లకు ఇచ్చిన పేరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వాటిని మరియు ఎబోలా వంటి ప్రధాన వైరస్ల జాబితాలో చేర్చింది

# బౌన్సర్ ఆడలేకపోయిన కోహ్లీ .. పంత్ సిక్సర్ల జోరు



సౌతాంప్టన్: ప్రపంచటెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ నేపథ్యంలో టీమిండియా ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ప్రాక్టీస్ అనంతరం కొత్త జోష్‌తో కనిపిస్తుంది. టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఇంకా మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో టీమిండియా తమ ప్రాక్టీస్‌ను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, అజింక్య రహానేలు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. దీనికి సంబంధించి బీసీసీఐ మంగళవారం ట్విటర్‌లో వీడియో రిలీజ్ చేసింది.ఈ వీడియోలో మొదట కోహ్లీ తన క్లాసిక్ షాట్లను ఆడాడు. కవర్ డ్రైవ్, స్క్వేర్‌కట్‌లతో మురిపించిన కోహ్లీ ఇషాంత్ బౌన్సర్ ఆడడంలో విఫలమయ్యాడు. బౌన్సర్‌ను ఎదుర్కొనే క్రమంలో పట్టుతప్పి కిందపడిపోయాడు. అనంతరం ప్రాక్టీస్‌కు వచ్చిన రిషబ్ పంత్ షమీ, ఇషాంత్‌లను ఎదుర్కొని భారీ షాట్లతో రెచ్చిపోయాడు. అనంతరం రవీంద్ర జడేజా బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఇక టీమిండియా వైస్ కెప్టెన్ అజింక్య రహానే కూడా ఇషాంత్, షమీ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కళాత్మక షాట్లతో ఆకట్టుకున్నాడు. అంతకముందు జరిగిన ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో పంత్, శుబ్‌మన్ గిల్, జడేజా, ఇషాంత్ శర్మ, మహ్మద్ సిరాజ్‌లు ఆకట్టుకున్నారు. ముఖ్యంగా పంత్ శతకంతో తన ఫామ్‌ను నిరూపించగా.. జడేజా,గిల్‌లు అర్ధ శతకాలతో రాణించారు. కాగా బౌలింగ్‌లో ఇషాంత్ 3 వికెట్లతో రాణించాడు.

# హాట్ షోతో హార్ట్ బీట్ పెంచుతున్న కుర్రబ్యూటీ!



చిత్రపరిశ్రమకు చెందిన ఫ్యామిలీస్ నుండి ఇండస్ట్రీలోకి ఎప్పటికప్పుడు వారసులు వస్తూనే ఉంటారు. అయితే అలా సెలబ్రిటీల పిల్లలు చేసే సందడి ప్రేక్షకులకు చాలా ముచ్చటగా అనిపిస్తుంది. ఎందుకంటే సెలబ్రిటీ కూతురు చిన్నప్పుడు ఎంత ముద్దుగా ఉంటుందో.. అదే కూతురు పెరిగి పెద్దదై సినిమాల్లో హీరోయిన్ గా అడుగుపెడితే కుర్రకారు మతులు పోవడం ఖాయం. ప్రస్తుతం అలాంటి కుర్రభామలు బాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారు. ఎందుకంటే ఫేవరేట్ హీరోయిన్ కూతురుగా ఆదరించిన ప్రేక్షకులు.. ఇప్పుడు అదే కూతురు హీరోయిన్ గా సినిమాల్లోకి వస్తే అందులోను గ్లామర్ షో చేస్తే పండగ చేసుకుంటున్నారు.ఇంతకీ ఆ కుర్రబ్యూటీ ఎవరో కాదు.. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలోని యంగ్ హీరోయిన్లలో ఒకరిగా కొనసాగుతుంది అమ్మడు. 2018లో ధడక్ అనే సినిమాతో అరంగేట్రం చేసిన జాన్వీ.. ఆ సినిమా డీసెంట్ హిట్ అవ్వడంతో వరుస అవకాశలతో బిజీగా గడుపుతోంది. ఇటీవలే రూహి అనే హారర్ సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. సినిమాల సంగతి పక్కనపెడితే.. సోషల్ మీడియాలో జాన్వీ ఫాలోయింగ్ గురించి అందరికి తెలిసిందే. అందుకే తనలోని గ్లామర్ అంతా బయటపెడుతూ సోషల్ మీడియాను ఏ విధంగా వాడుకోవాలో ఆ విధంగా వాడుకుంటోంది.ఖాళీ దొరికితే అమ్మడు హాట్ ఫోటోషూట్స్ తో సోషల్ మీడియాను హీటెక్కిస్తుంది. తాజాగా జాన్వీ లేటెస్ట్ ఫోటోషూట్ సంబంధించిన ఫోటోలు ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. ఆ ఫోటోలు చూస్తే జాన్వీ బాలీవుడ్ గ్లామర్ డాల్ అవుతుందనే అనిపిస్తుంది. అందమైన పోజులతో వయ్యారి చాలా హ్యాపీగా కనిపిస్తుంది. ప్లేస్ ఎక్కడ అనేది మెన్షన్ చేయలేదు కానీ ఫోటోలలో మాత్రం జాన్వీ మెరిసిపోతుంది. వైట్ టాప్ ధరించి లోదుస్తులు కనిపించేలా ఓ పోజు పెట్టింది. వయ్యారి టాప్ టు బాటమ్ అందాలకు ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం జాన్వీ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికి వస్తే జాన్వీ ఇప్పుడు దోస్తానా-2 సినిమా చేస్తోంది.

# ఈషా రెబ్బా లక్కీ ఛాన్స్.. ఆ హీరోతో కలిసి

ఇప్పటి వరకు పలు సినిమాల్లో నటించినప్పటికీ.. తగిన గుర్తింపు దక్కించుకోలేకపోయింది తెలుగు సోయగం ఈషా రెబ్బా. అయితే.. హీరోయిన్ గా సత్తా చాటేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. నిత్యం హాట్ ఫొటో షూట్ లు నిర్వహిస్తూ.. సోషల్ మీడియా వేదికగా అభిమానులకు టచ్ లోనే ఉంటోంది. ఈ క్రమంలోనే మలయాళం ఇండస్ట్రీ నుంచి మంచి ఛాన్స్ కొట్టేసింది.డైరెక్టర్ ఫెల్లిని రూపొందిస్తున్న ఓ సినిమాలో హీరోయిన్



గా ఎంట్రీ ఇస్తోంది. కుంచాకో బోబన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రముఖ హీరో అరవింద్ స్వామి కూడా నటించనున్నారు. ఈ సినిమా గురించి ఈషా రెబ్బ మాట్లాడుతూ.. తనను ఓ సినిమాలో చూసి డైరెక్టర్ ఫెల్లిని సెలక్ట్ చేశారని చెప్పారు. అయితే.. స్క్రిప్టు విన్న తర్వాతే ఓకే చెప్పానని స్టోరీ విన్న తర్వాత ఖచ్చితంగా హిట్ అవుతుందన్న కాన్ఫిడెన్స్ వచ్చిందని అన్నారు.ఇద్దరు ఫ్రెండ్స్ మధ్య ఉండే రిలేషన్ ను బేస్ చేసుకొని ఈ సినిమా తెరకెక్కనుందని తెలిపింది ఈషా. కరోనా పరిస్థితులు చక్కబడిన తర్వాత గోవాలో షూట్ ప్లాన్ చేస్తున్నట్టు తెలిపింది. కాగా.. తెలుగు అమ్మాయిలు స్టార్ హీరోయిన్లుగా మారడం అరుదుగానే జరుగుతోంది. ప్రస్తుతం ఈ రేసులో ఉన్నవారు కూడా చాలా తక్కువే. మరి ఈషారెబ్బ ఎలాంటి స్టార్ డమ్ క్యాచ్ చేస్తుందనేది చూడాలి.




# మోస్ట్ డిజైరబుల్ సమంత.. ఇంతలోనే నెట్ ఫ్లిక్స్ డీల్!




ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2 లో ఎల్.టి.టి.ఇ రెబల్ రాజీ పాత్రలో సమంత నటనకు క్రిటిక్స్ ప్రశంసలు అందుకున్న సంగతి తెలిసిందే. సమంత నటనకు అభిమానులు గొప్పగా అభినందిస్తున్నారు. అక్కినేని కోడలికి సోషల్ మీడియాల్లో ఇప్పటికీ శుభాకాంక్షలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.ఇంతలోనే సమంతను చెన్నై టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ 2020 జాబితాలో నంబర్ 1 స్థానాన్ని కట్టబెట్టింది. తాను ఈ స్థాయికి చేరానంటే దాని వెనక కఠోర శ్రమను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కాస్త ఆలస్యంగానే అయినా .. మొత్తానికి ఇది దక్కింది. చెన్నై టైమ్స్ కి థాంక్స్ అని ఆనందం వ్యక్తం చేశారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సక్సెస్ నేపథ్యంలో సామ్ కి మరో బంపరాఫర్ తగిలిందని తెలుస్తోంది. తాజాగా మరో గ్లోబల్ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సమంతను ఓ వెబ్ సిరీస్ కోసం సంప్రదించింది. ప్రస్తుతం చర్చలు సాగుతున్నాయి. నెట్ ఫ్లిక్స్ సమంతకు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేసిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సామ్ టైటిల్ పాత్రలో సరికొత్త థ్రిల్లర్ సిరీస్ ని తెరకెక్కించే ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. సమంతా తన నట ప్రతిభను చూపించేందుకు స్టార్ డమ్ ను పెంచుకునేందుకు విభిన్న ప్రాజెక్టులపై పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిసింది. సామ్ ప్రస్తుతం గుణశేఖర్ తెరకెక్కిస్తున్న శాకుంతలం చిత్రంలో నటిస్తోంది.

# మత్తు కళ్ల పూజా విరహాగ్నితో జ్వలిస్తోంది!



ఓవైపు టాలీవుడ్ మరోవైపు బాలీవుడ్ రెండిటినీ మ్యానేజ్ చేస్తూనే కోలీవుడ్ పైనా దృష్టి సారించింది పూజా హెగ్డే. మూడు పరిశ్రమల్లో వరుస చిత్రాలకు సంతకాలు చేసి క్షణం తీరిక లేనంత బిజీగా ఉంది. మరోవైపు ఈ ముంబై బ్యూటీ సోషల్ మీడియాల్లోనూ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ భారీ ఫాలోయింగ్ ని పెంచుకుంటోంది. ఇన్ స్టా వేదికగా ప్రకటనల ఆదాయం ఆర్జిస్తోంది.తాజాగా పూజా ఇన్ స్టా వేదికగా షేర్ చేసిన హాట్ ఫోటోషూట్ యువతరంలో ట్రెండింగ్ గా మారింది. పూజా నెవ్వర్ బిఫోర్ లుక్ ఇది అంటూ బోయ్స్ కితాబిచ్చేస్తున్నారు. మత్తు కళ్ల పూజా విరహాగ్నితో జ్వలిస్తోంది! అంటూ ఆ ఫోటోగ్రఫిక్ సమ్మోహనంపై వ్యాఖ్యల్ని గుప్పిస్తున్నారు. పూజా వెట్ లుక్ ఆయిలీ టోన్డ్ బాడీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్లాక్ అండ్ వైట్ లో సరికొత్త మూడ్ ని క్రియేట్ చేస్తోంది.మహారాష్ట్రలో లాక్ డౌన్ ని సడలిస్తుండడంతో పూజా జిమ్ లో తన వ్యాయామ సెషన్లను తిరిగి ప్రారంభించింది. తదుపరి షూటింగులకు జాయినయ్యేందుకు సిద్ధమవుతోంది. పూజా కథానాయికగా నటించిన రాధేశ్యామ్.. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ రిలీజ్ లకు రావాల్సి ఉంది. రోహిత్ శెట్టి దర్శకత్వంలో సిర్కస్ అనే చిత్రంలోనూ నటిస్తోంది. సల్మాన్ సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. అటు తమిళంలో దళపతి 65లోనూ కథానాయికగా అవకాశం దక్కించుకుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190